190 మంది ఎస్జీటీలకు పదోన్నతి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఎట్టకేలకు ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తయింది. మంగళవారం 190 మంది సెకండరీగ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. గత వారం 31 మంది స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. కాగా జిల్లాలో పదోన్నతుల ప్రక్రియ ముగిసినట్టు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

వచ్చే నెల మొదటి వారంలో

మెడికల్ కాలేజీ భవనం ప్రారంభం

- పెండింగ్ పనులను పూర్తి చేయాలి
- అదనపు డీఎంఈ వాణి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీ నూతన భవనాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని వైద్య విద్య అదనపు సంచాలకురాలు (అడిషనల్ డీఎంఈ) వాణి అధికారులకు సూచించారు. సంగారెడ్డిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హాస్టల్ భవనాలను మంగళవారం పరిశీలించారు. సెప్టెంబరు మొదటి వారంలో భవనాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. అనంతరం మెడికల్ కాలేజీకి అనుబంధంగా నిర్మించనున్న 500 పడకల ఆస్పత్రి నూతన భవన శంకుస్థాపన ఏర్పాట్లను, జీజీహెచ్‌లో క్యాన్సర్ డేకేర్ సెంటర్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ జి.అనిల్‌కుమార్, సీఎస్ ఆర్ఎంవో వీరాంజనేయులు, ఆర్అండ్‌బీ ఏఈఈ శశాంక్, టీజీఎంఎస్ఐడీసీ ఏఈ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ కాలేజీ భవనాన్ని పరిశీలిస్తున్నఅడిషనల్ డీఎంఈ వాణి

తొమ్మిదేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న

సుష్మకు రూ.3లక్షలు సాయంచేసిన జగ్గారెడ్డి

దాతలు కూడా ఆర్థికంగా ఆదుకోవాలన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

త్వరగా కోలుకునేలా వైద్యులతో మాట్లాడిన జగ్గారెడ్డి


సుష్మ తండ్రి మహేశ్‌కు రూ. 3లక్షలు అందజేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన ఓ అమ్మాయికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేయూత అందించారు. రూ.3లక్షల ఆర్థిక సహాయం చేసి ఆసరాగా నిలిచారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండకు చెందిన చెవిగాని మహేశ్ కూతురు సుష్మకు ప్రస్తుతం 18 సంవత్సరాలు. ఆమె తొమ్మిదేళ్ల వయసులో తన అమ్మమ్మ ఇంటికి వెళ్లగా పొరపాటున చీమల మందు కలిసిన చపాతీలు తినడంతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. గత 9 ఏళ్లుగా ఆమె మంచానికే పరిమితమైంది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో సుష్మకు మెరుగైన చికిత్స అందించలేకపోయారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్ మీడియా వ్యక్తుల ద్వారా విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి ఆ అమ్మాయి తండ్రిని పిలిపించుకున్నారు. వైద్యచికిత్స కోసం రూ.3లక్షలు అందించడంతోపాటు డాక్టర్ చంద్రశేఖర్‌తో మాట్లాడి ఆమె త్వరగా కోలుకునేలా చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరపున కూడా వైద్య ఖర్చులు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. దాతలు కూడా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సహాయం చేయాలనుకునేవారు సుష్మ తండ్రి మహేశ్ నంబర్‌ను 9553461480 సంప్రదించాలని సూచించారు.

సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా యాదగిరి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా (డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్-డీహెచ్‌క్యూహెచ్) ఎస్.యాదగిరిని నియమిస్తూ టీవీవీపీ కమిషనర్ అజయకుమార్ మంగళవారం ఉత్తర్వుల జారీ చేశారు. ఇప్పటివరకు సీఎస్ ఆర్ఎంవో హోదాలో డీసీహెచ్ఎస్‌గా కొనసాగిన కె.సంగారెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించి వెంటనే హైదరాబాద్‌లోని టీవీవీపీ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. సదాశివపేట సీహెచ్‌సీలో జనరల్ సర్జన్ హోదాలో (సివిల్ సర్జన్ స్పెషలిస్ట్) విధులు నిర్వహిస్తున్న యాదగిరికి ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. పరిపాలన సౌలభ్యంలో భాగంగా వైద్యాధికారుల మార్పు ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని కమిషనర్ పేర్కొన్నారు.

నెల రోజుల్లోనే ఇద్దరి బదిలీ

సంగారెడ్డి జిల్లాలో వైద్యాధికారుల స్థానచలనం చర్చనీయాంశంగా మారింది. గత నెల 25న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవిని బాధ్యతల నుంచి తప్పించి కోహీర్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా తన ఒరిజినల్ పోస్టుకు బదిలీ చేస్తూ హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా డీసీహెచ్ఎస్ కె.సంగారెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించి ఏకంగా టీవీవీపీ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు జిల్లాస్థాయి అధికారులను తప్పించడం వైద్య ఆరోగ్య శాఖ వర్గాల్లో చర్చకు దారితీసింది. జోగిపేట ఏరియా ఆస్పత్రిలో నాలుగు రోజుల కిందట ఓ గర్భిణిపై గైనకాలజిస్ట్ దురుసుగా ప్రవర్తించిన ఘటన వెలుగు చూసిన విషయం తెలిసిందే. పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి సంఘటన చోటుచేసుకుందనే ఆరోపణలే ఆయన తొలగింపునకు కారణమని చర్చించుకుంటున్నారు.

గణనాథుల జోష్

ఆర్భాటంగా మండపాలు.. అట్టహాసంగా నవరాత్రులు

- ఎన్నికల సీజన్‌లో పోటాపోటీగా నేతల విరాళాలు
- కొన్నిచోట్ల పూజా మండపాలే ప్రచార కేంద్రాలు


మెదక్‌లో వినాయకుడి ప్రతిమను మండపానికి తెస్తున్న యువకులు

మెదక్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వినాయక నవరాత్రుల సందడి నెలకొంది. వీధి వీధిలో గణనాథుడి మండపాలు ముస్తాబవుతున్నాయి. ఎప్పటిలా భక్తి పారవశ్యమే కాకుండా త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈసారి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. మండపాలు ఆర్భాటంగా ముస్తాబవుతున్నాయి. సాధారణంగా ఉత్సవాల నిర్వాహకులు ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించేవారు. కానీ, ఈసారి ఎన్నికల సీజన్ కావడంతో నాయకులే ముందుకు వచ్చి చెందాలు ఇస్తున్నారు. గతంలో రూ. 50వేలు సేకరించడానికి వారాలు పట్టేది. ఈసారి ఒక్క రోజులో లక్ష రూపాయలు వసూలవుతున్నాయని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భారీ ప్రతిమల ఆకర్షణ

మెదక్ జిల్లావ్యాప్తంగా 3వేలకు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తారని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు 1,394 మండపాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. వాటిలో చాలావరకు 15 అడుగుల వరకూ ఎత్తు ఉన్న ప్రతిమలే ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. మున్సిపాలిటీలు, పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ భారీ వినాయక ప్రతిమలను నెలకొల్పుతున్నారు. ఎవరి ప్రతిమ ఎత్తు ఎక్కువో, ఎవరి అలంకరణ ఘనమో అన్న పోటీ కనిపిస్తోంది. ఎన్నికల మూడ్ దానికి మరింత ఊపునిస్తోంది. మండపాల్లో కేవలం పూజా కార్యక్రమాలే కాదు. సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, భజనలతో కూడిన రాత్రి వేడుకలు కూడా ఉత్సాహంగా నిర్వహించడానికి మండపాల నిర్వాహకులు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాలతో పాటు ఆయా గ్రామాలు, పట్టణాల ప్రజలంతా ఒకే వేదికపై కలుసుకునే అవకాశం లభిస్తోంది.

ఎన్నికల వేదికల్లా పండుగలు

పండుగల సమయంలో ప్రజలు ఎక్కువగా గుమిగూడే మండపాలను కూడా రాజకీయ ప్రచారినికి వాడుకుంటున్నారు. తోచిన సహాయం అందించడమే కాకండా వారి అనుచరులు తమ నాయకుల ఫ్లెక్సీలు, పోస్టర్లతో మండపాలను అలంకరించడానికి సన్నద్ధులవుతున్నారని సమాచారం. గణనాథుల ఆశీర్వాదం పొందడమే కాకండా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమూ లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తంగా చూస్తే ఈసారి వినాయక నవరాత్రులు భక్తి, వినోదం, రాజకీయ రంగులు కలిసిన ప్రత్యేక ఉత్సవంగా జిల్లాలో కొనసాగనున్నాయి. గననాథుడి జోష్‌తో పాటు ఎన్నికల జోష్ కూడా కలగలిసిపోయి ఈ వినాయక చవితి పండుగకు కొత్త శోభను తెచ్చాయి..

పోలీసుల భద్రత

ఎన్నికల వాతావరణం, భారీగా ఏర్పాటవుతున్న మండపాలు, ఊరేగింపుల నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. మున్సిపాలిటీలు, పట్టణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచుతున్నారు.ప్రస్తుతం వినాయక నవరాత్రులతో పాటు మిలాదుల్ నబీ పండగ కూడా వస్తున్నందున ప్రజలంతా సామరస్యంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి ప్రతిమలను పూజించాలని పేర్కొన్నారు. మండపాలను రోడ్లు, కాలిబాటలపై ఏర్పాటు చేయకూడదని ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మైకులు, లౌడ్‌స్పీకర్లు తక్కువ శబ్ధంతో రాత్రి 10 గంటల వరకూ మాత్రమే వినియోగించాలన్నారు. పాఠశాలలు, ప్రార్థనా మందిరాల వద్ద లౌడ్ స్పీకర్లు వాడరాదని హెచ్చరించారు. ఇక ఎలాంటి గొడవలు జరగకండా పాత నేరస్థులను ముందస్తుగా బైండోవర్ చేసి, సమస్యలు సృష్టించే వారిపై కఠిన చెర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అందోలులో శాండ్ బజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్

పేదల సొంతింటి

కల నెరవేరుస్తాం

'శాండ్ బజార్'లో తక్కువ ధరకే ఇసుక

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చడానికి తమ ప్రభుత్వం కృషిచేస్తున్నదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. అందోలులో రాష్ట్ర మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక సమస్య ఉన్నట్లు గుర్తించామని, ఇసుక అందజేసేందుకే శాండ్ బజార్‌లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మార్కెట్‌లో టన్ను ఇసుక రూ.2,500 పలుకుతుండగా శాండ్ బజార్‌ల ద్వారా ప్రభుత్వం టన్ను రూ.1,200కే అందజేస్తున్నదని వివరించారు. జిల్లాలో తొలిసారి అందోలులో శాండ్ బజార్ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం అందోలు-జోగిపేట మున్సిపాలిటీకి మంజూరైన నీటిట్యాంకర్, చెత్త తరలించే ట్రాక్టర్లను మంత్రి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టీజీఎండీసీ ఎండీ భవేశ్‌మిశ్రా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రఘుబాబు, జోగిపేట ఏఎంసీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మునిపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుదేరా చౌరస్తాలో ఉన్న గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, హాస్టల్లో వసతులను పరిశీలించారు.

బంగారం దుకాణాల్లో భద్రత కట్టుదిట్టం

సీసీ కెమెరాలు, వాల్ సెన్సార్‌ను ఏర్పాటు చేసుకోవాలి

సంగారెడ్డి ఎస్పీ పంకజ్


సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బంగారం దుకాణాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు, వాల్ సెన్సార్‌లను ఏర్పాటు చేసుకోవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లాలోని బంగారం దుకాణాల యజమానులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. బంగారం దుకాణాల్లో భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగిన సెక్యూరిటీని నియమించుకోవాలి సూచించారు. అపరిచిత. అనుమానిత వ్యక్తుల నుంచి బంగారం కొనుగోలు చేయరాదని, దొంగసొత్తు అని పిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసరమైతే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీలు సత్తయ్యగౌడ్, ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మాసాయిపేటలో

వీధి కుక్కల తరలింపు

మాసాయిపేట ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాసాయిపేటలో సోమవారం సాయంత్రం గ్రామస్థులపై వీధి కుక్కలు దాడిచేసి 17 మందిని గాయపర్చిన ఘటనపై అధికారులు స్పందించారు. మెదక్ మున్సిపల్ అధికారుల సహకారంతో మంగళవారం ఉదయం గ్రామంలో 25 శునకాలను బంధించి తరలించారు. గ్రామంలో మిగిలిన కుక్కలకు సైతం స్టెరిలైజేషన్ చేయిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డీఎస్పీవో యాదయ్య, మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


మాసాయిపేటలో స్టెరిలైజేషన్ కోసం తరలిస్తున్న వీధికుక్కలు

కమీషన్ ఇవ్వరా?

- రేషన్ డీలర్లకు ఐదు నెలలుగా బకాయి
- సంగారెడ్డి జిల్లాలో 846 మంది డీలర్లు
- ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయి రూ. కోట్లు
- వెంటనే ఇవ్వకపోతే వచ్చే నెల రేషన్ బంద్


సంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఐదు నెలలుగా కమీషన్ డబ్బులు రాకపోవడంతో రేషన్ డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే చాలీచాలని కమీషన్.. నెలల తరబడి బకాయిలు పేరుకుపోవడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నామని వాపోతున్నారు. రేషన్ దుకాణాల అద్దెలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ చెల్లించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మాధురితో పాటు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించిన విషయం తెలిసిందే. బకాయిలు విడుదల చేయకపోతే సెప్టెంబరు కోటా సన్నబియ్యం పంపిణీని నిలిపేస్తామని డీలర్లు స్పష్టం చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 846 మంది డీలర్లు

సంగారెడ్డి జిల్లాలో 846 రేషన్ దుకాణాలుండగా, 846 మంది రేషన్ డీలర్లున్నారు. వీరికి సరఫరాలో కిలోకు రూపాయి 40 పైసల కమీషన్ రూపంలో డీలర్లకు చెల్లిస్తారు. అంటే క్వింటాలుకు రూ.140 కమీషన్

మిగతా 8వ పేజీలో

వచ్చే నెల రేషన్ పంపిణీ నిలిపేస్తాం



ఐదు నెలలుగా కమీషన్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం. ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా సర్కారు స్పందించడం లేదు. కమీషన్ బకాయిలు వెంటనే చెల్లించకపోతే వచ్చే నెల నుంచి రేషన్ పంపిణీ నిలిపివేస్తాం. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కమీషన్‌ను రూ.300కు పెంచాలి, ప్రతి నెలా రూ.5 వేల గౌరవ వేతనం, బీమా సౌకర్యం కల్పనకు కృషి చేయాలి.

- శశికాంత్‌చందన్, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు

మట్టి వినాయకులనే పూజిద్దాం : మెదక్ కలెక్టర్


అదనపు కలెక్టర్‌కు మట్టి వినాయకుడి ప్రతిమను అందజేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజలు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో బీసీ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మట్టి గణపతులనే పూజిద్దామని కోరారు. మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, బీసీ సంక్షేశాఖాధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోస్టల్ సిబ్బందికి పింఛన్ల పంపిణీ కోసం స్పెర్ ద్వారా అందిన 111 మొబైల్ ఫోన్లు, వేలిముద్రల మిషన్లనను అందజేశారు.


శివ్వంపేటలో లైన్లో చెప్పులు, ఇటుకలు

పంట కోసం పండగనక..

యూరియా కోసం రైతుల పాట్లు


టోకెన్ల కోసం బారులు


7

జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో

పటాన్‌చెరు యువకుడికి తృతీయస్థానం

7










విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారి, సైబర్ క్రైం వల్ల ఎందరి జీవితాలు నాశనం అవుతున్నాయని వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ వాటికి దూరంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో డ్రగ్స్ సైబర్ క్రైంపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రలోభాలకు గురై క్షణికానందం కోసం వెళ్తే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. సైబర్ క్రైంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగు యాప్స్‌కు కూడా చాలా మంది యువత బానిసలుగా మారి డబ్బుతో పాటు జీవితాలను నాశనం చేసుకుంటున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయని అన్నారు. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకుని లక్షలు వెచ్చించి చదివిస్తున్నారని వారి ఆశలను వమ్ము చేయకుండా ఉన్నతలక్ష్యముతో కష్టపడి చదివి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం, కాలేజీ యాజమాన్యం పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు

















నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద సాయంత్రం ఐదుగంటలకు కూడా రైతుల పడిగాపులు

పండగనక పడిగాపులు

యూరియా కోసం జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు కష్టాలు పడుతూనే ఉన్నారు. పంటలను కాపాడుకునేందుకు వినాయక చవితి పండగను సైతం లెక్కచేయకుండా మంగళవారం దుకాణాల వద్ద పడిగాపులు పడ్డారు.

నర్సాపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ప్రధాన చౌరస్తా వద్ద రైతులు ఎరువుల కోసం ధర్నా చేస్తుండగా అటువైపు వచ్చిన ఎమ్మెల్యే సునీతారెడ్డి రైతులకు మద్దతు పలికారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటం.. ఎమ్మెల్యే ఆందోళన విరమణకు ససేమిరా అనడంతో పోలీసులు ఆమెతోపాటు నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం వదిలిపెట్టారు.

● తొగుట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి మంగళవారం యూరియా వస్తుందనే సమాచారంతో ఉదయం నుంచే రైతులు పెద్ద ఎత్తున తొగుటకు చేరుకుని ఆగ్రోస్ దుకాణం వద్ద బారులు తీరారు. ఎంతకీ యూరియా రాకపోవడంతో రాస్తారోకో చేపట్టారు.

● పుల్‌కల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన పుల్కల్‌లో యూరియా బస్తాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఒక్కో బస్తాకు రూ.266.50కి విక్రయించాల్సి ఉండగా, రూ.310 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా గంట గుళికలు తీసుకుంటేనే యూరియా ఇస్తామంటూ దుకాణ యజమాని షరతు పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. గంగోజిపేటలోనూ రైతులు క్యూలో నిల్చున్నారు.

అధికారులను నిలదీత

సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన చౌటకూర్‌లో మంగళవారం వ్యవసాయ శాఖ-ఇఫ్కో అధ్వర్యంలో నానో యూరియా ప్లస్, డీఏపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాగా, ఖరీఫ్ సీజన్‌లో కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేయకుండా ఈ అవగాహన సదస్సులు ఏంటని జిల్లా వ్యవసాయాభివృద్ధి శాఖ అధికారి శివప్రసాద్, ఇతర అధికారులను రైతులు నిలదీశారు.

● శివ్వంపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి 11 గంటల నుంచి సద్ది కట్టుకొని వచ్చి చెప్పులు, ఇటుకలు వరుస సంఖ్యలో పెట్టి నిరీక్షిరచారు. ఉదయం సిబ్బంది వచ్చి యూరియా రాదని చెప్పడంతో రైతులు ధర్నాకు దిగారు.

● కంది, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కంది పీఏసీఎస్‌కు అన్నదాతలు పోటెత్తారు. 350 బస్తాలు మాత్రమే దిగుమతి కావడంతో ముందుగా వచ్చిన రైతులకు ఒకొక్కరికి 2 బస్తాల చొప్పున అందజేశారు. దొరకనివారు నిరాశతో వెనుదిరిగారు.

● జిన్నారం, అగస్టు 26, (ఆంధ్రజ్యోతి): జిన్నారంలోని రెండు ఫర్టిలైజర్ షాపులకు సమీప గ్రామాల రైతులు ఒక్కసారిగా వెళాటంతో కొద్ది సేపు గందరగోళం నెలకొన్నది.

● మద్దూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలోని లద్నూరు క్లస్టర్‌లోని లద్నూరు, మర్మాముల, సలాఖ్‌పూర్, ధర్మారం గ్రామాల రైతులకు పోలీసుల పహారాలో రైతులకు యూరియా టోకెన్లు అందించారు. నాలుగు గ్రామాల రైతులకు రైతు వేదికలో ఒకే చోట కూపన్లు అందించడంతో రైతుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

● హుస్నాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ రైతు వేదిక వద్ద యూరియా టోకెన్ల కోసం రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.


తొగుటలో రాస్తారోకో చేస్తున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు


చౌటకూర్‌లో వ్యవసాయ అధికారులను నిలదీస్తున్న రైతులు


జిన్నారంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం వద్ద బారులు తీరిన రైతులు


నర్సాపూర్‌లో ఎరువుల కోసం ధర్నా చేస్తున్న రైతులకు మద్దతుగా పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


పుల్కల్‌లో యూరియా కోసం ఎగబడిన రైతులు


చౌటకూర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు


శివ్వంపేటలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు


యూరియా టోకెన్ల కోసం హుస్నాబాద్ రైతు వేదికలో రైతుల రద్దీ

బొర్ర పేరుమాండ్లే బొజ్జ గణపయ్య

- 400 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఆలయం
- కుడివైపు తొండం, దక్షిణాభిముఖంగా ఆలయద్వారం
- దండం పెట్టి కొబ్బరికాయ కొడితే కొంగు బంగారం
- 11 ప్రదక్షిణలు చేస్తే వరాలనొసగే వినాయకుడు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని బొర్రపేరుమాండ్ల వీధిలోని బొర్రపేరుమాండ్ల ఆలయానికి సుమారుగా 4వందల ఏళ్ల చారిత్రక నేపథ్యం ఉంది. 12వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించారని, కాకతీయుల కాలం నాటిదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఇందుకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు లేవు. ఇక మరికొంత మంది స్థానికులు అనుకుంటున్న దాని ప్రకారం సిద్దిపేట పట్టణం ఏర్పడకముందే ఇక్కడ మాతంగి అనే నది ప్రవహించేదని, ఆ నది ఒడ్డున నల్ల రాతితో చేసిన గణపతి విగ్రహంతో పాటుగా మరికొన్ని విగ్రహాలు లభ్యమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అలా దొరికిన విగ్రహాలను ఒకచోట చేర్చి ఆలయం నిర్మించారని అంటున్నారు. అప్పటి నుంచి బొర్ర పేరుమాండ్ల దేవాలయంగా పిలుస్తారని, పేరుమాండ్లు అనేది తమిళనాడులో ఎక్కువగా వాడుకలో ఉంటుందని భక్తి, మర్యాదపూర్వకంగా పేరుమాండ్లు అని సంబోధిస్తారని చెబుతున్నారు. సాధరణంగా వినాయక విగ్రహాలకు తొండం ఎడమ వైపు ఉంటుంది. కానీ ఇక్కడ కుడివైపు ఉంటుంది. తొండంకు ప్రత్యేకంగా వెండితో తొడుగు చేయించారు. తొండం కుడివైపు ఉండటం వల్ల విశేషమైన ఆకర్శణ ఉంటుందని దేవాలయ అర్చకులు చెబుతున్నారు. 11 ప్రదక్షిణలు చేసి ఒక కొబ్బరికాయ కొట్టి స్వామికి దండం పెడితే కోరిన కోరికలు తీరుతాయని ఈ ఆలయానికి వచ్చే భక్తుల నమ్మకం. ఈ మొక్కును కొబ్బరికాయ దండం అని పిలుస్తారు. ఈ ఆలయంలో గణపతితో పాటుగా అంబిక అమ్మవారు, సుబ్రమణ్య స్వామి, సూర్యభగవానుడు, నంది, ఆంజనేయ స్వామి కొలువై భక్తులను అనుగ్రహిస్తున్నారు. పూర్వకాలం నుంచి కాలక్రమేణ కొందరు ముందుకొచ్చి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. ఆ వారసత్వాన్ని, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రస్తుతం కూడా బొర్ర పేరుమాండ్ల దేవాలయ కమిటిగా ఏర్పడి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం వినాయక నవరాత్రులు, ఆలయ 53వ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 రోజులపాటు గణపతి హోమం నిర్వహించనున్నారు. ఇవేకాకుండా ప్రతిరోజు స్వామివారికి దూపదీప నైవేద్యం, మంగళ, శనివారాల్లో 25 కిలోల వరకు ప్రసాద వితరణ ఉంటుంది. నెలకోసారి వచ్చే సంకష్టహర చతుర్ధికి గణపతి హోమం, అన్న ప్రసాద వితరణ ఏర్పాటుచేస్తారు.



స్వామివారి మూలవిరాట్

ఆరడుగుల ఏకశిలా వృద్ధి వినాయకుడు



రేగోడు ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): రేగోడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రేగోడులోని ప్రసిద్ధ వినాయకుని ఆలయం ఉత్సవాలకు సిద్ధమైంది. ఇక్కడ ఉన్న ఆరడుగుల ఏకశిలా వినాయకుడు దాదాపు 500 ఏళ్ల నాటిదని గ్రామస్థుల నమ్మకం. ఈ ఆలయంలోని వినాయకుడి విగ్రహం ప్రతి ఏటా కొంత పెరుగుతోందని అందుకే 'వృద్ధి వినాయకుడిగా' పిలుస్తారని గ్రామస్థులు చెబుతుంటారు. ఆలయం పక్కనే సంస్కృతంలో చెక్కిన శిలాఫలకం కూడా ఉంది. వినాయక చవితి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఆలయం వద్ద నిత్య దానం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో సాయిక్‌కుమార్‌కు తృతీయస్థానం


సాయికుమార్

పటాన్‌చెరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణానికి చెందిన బాడీబిల్డర్ సాయికుమార్ జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించారు. ఆదివారం శంషాబాద్‌లో జరిగిన ఐసీఎన్ ఇండియా నేచురల్ బాడీబిల్డింగ్ పోటీల్లో దేశవ్యాప్తంగా వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్‌లో 30 మందితో పోటీపడ్డ సాయికుమార్, మూడో స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. బీరంగూడలో 90 రోజుల పాటు శిక్షణ తీసుకున్నట్లు ఆయన కోచ్ భాస్కర్ తెలిపారు.

కేంద్ర నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

- రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్


తాగునీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

గజ్వేల్/జగదేవ్‌పూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం నడుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ అన్నారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులుగా నడిపిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో యూరియా సమస్య తలెత్తిందని, ఆ నెపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తుందని విమర్శించారు. అలాగే మంగళవారం ఆయన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీర్ల ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపోచమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాగనోళ్ల విజయమోహన్, వైస్ చైర్మన్లు సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నిమ్మ రంగారెడ్డి, రవిందర్‌గుప్తా, గన్నెపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పందిళ్ల' వంతెన పైనుంచి రాకపోకలు షురూ

- దశాబ్దాల సమస్యకు పరిష్కారం



హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల నెరవేరింది. పందిల్ల వాగుపై నిర్మించిన హై లెవల్ వంతెనతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయాయి. వానాకాలం వస్తే భారీ వర్షాలతో పందిల్ల వాగులోని లో లెవల్ వంతెనపై వరద ప్రవాహం ప్రవహించి రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో హన్మకొండ-సిద్దిపేట మధ్య ప్రయాణం కష్టంగా ఉండేది. అయితే జాతీయ రహదారి (765 డిజి) నిర్మాణంలో భాగంగా పందిల్ల వాగుపై హై లెవల్ వంతెనను నిర్మించారు. ఆరు పిల్లర్లతో నిర్మించిన ఈ వంతెన పనులు పూర్తి కావడంతో శుక్రవారం సాయంత్రం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

లేఖ ఎవరు రాశారు..!

- చర్చనీయాంశంగా గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిపై ఆంధ్రజ్యోతి కథనం

గజ్వేల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వాసుపత్రితో పాటు పట్టణవ్యాప్తంగా ఆంధ్రజ్యోతి కథనం చర్చనీయాంశంగా మారింది. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో లోటుపాట్లపై ఆసుపత్రి సిబ్బంది, బాధితులు మంత్రికి లేఖ రాశారు. ఈ లేఖ 'ఆంధ్రజ్యోతి'కి చిక్కడంతో లేఖలోని అంశాలను బహిర్గతం చేస్తూ కథనాన్ని ప్రచురించగా, తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో లేఖ ఎవరు రాశారు.. వారికి జరిగిన నష్టం ఏమిటి...? ఎందుకు రాశారు.. తమతో ఇబ్బంది పడిన వారు.. ఎవరనే విషయంపై అధికారులు, సిబ్బంది ఒకరికొకరు చర్చించుకుంటూ ఆరా తీశారు. ఈ క్రమంలోనే పలువురు బాధితులు ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు, మెడికల్ దుకాణాల నిర్వాహకుల దందా, ఇతరత్రా సమస్యల గురించి 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ ద్వారా తెలియజేశారు. పెద్ద ఎత్తున సిబ్బంది దందాకు పాల్పడుతున్నారని, వారికి సంబంధించిన ఆధారాలు ఇస్తామని తెలిపారు.

పారదర్శకంగా సేవలను అందిస్తున్నాం..

ప్రజలకు పారదర్శకంగా సేవలను అందిస్తున్నామని, గిట్టని వాళ్లే తమపై ఆరోపణలు చేస్తున్నారని గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఆంధ్రజ్యోతి కథనం విషయమై మంగళవారం ఆమె మాట్లాడుతూ.. కొంతమంది చిల్లర వ్యక్తులు కావాలనే పని కట్టుకుని తమపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఎంతో చిత్తశుద్ధితో ప్రజలకు సేవలను అందిస్తున్నామని, ఎక్కడా లాభాపేక్ష లేకుండా, నిష్పక్షపాతంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తున్నామని, ప్రజలు అపోహలు , వదంతులు నమ్మవద్దని తెలిపారు.

పారిశ్రామిక భద్రతలో వ్యవస్థాగత సంస్కరణలు జరగాలి


కార్యక్రమంలో పాల్గొన్న బాధిత కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనకు ప్రతి స్పందనగా పారిశ్రామిక భద్రతలో తక్షణ, వ్యవస్థాగత సంస్కరణలు జరగాలని పౌర సమాజ సంస్థలు డిమాండ్ చేశాయి. ఉప్పల్‌లోని మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్‌లో సైంటిస్ట్ ఫర్ పీపుల్, హ్యూమన్ రైట్స్ ఫోరం, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, వర్కింగ్ పీపుల్స కోయలిషన్ సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో బాధితుల కుటుంబాలు తమ ఆవేదనను వెలిబుచ్చాయి. ఈ సందర్భగా బ్రదర్ వర్గీస్ థెక్కనాథ్, శాస్త్రవేత్త డాక్టర్ బాబూరావు, న్యాయవాది అఖిల్‌సూర్య మాట్లాడుతూ యాజమాన్యాలు కార్మికులను రక్షించడం కంటే పారిశ్రామిక వృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. పాత చట్టాలు న్యాయం చేయలేవని, పరిహారం చెల్లింపుల బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ఉపయోగించకూడదని సూచించారు. కొత్త లేబర్ కోడ్‌లు రాష్ట్ర అధికారాలను తగ్గించాయన్నారు. చట్టాల అమలు, పారదర్శక నివేదికలు, బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక మద్దతు అవసరమన్నారు. కార్యక్రమంలో సాగర్, ధార, రవి కన్నెగంటి, పీజీ రావు, సాత్విక గుప్తా, డా. ప్రకాష్ లూయిా, ట్రేడ్, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. భవానీ చంద్ర కోరారు. జిల్లా కోర్టులో మంగళవారం జిల్లాలోని బ్యాంకు, ఇన్సురెన్స్, చిట్‌ఫండ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు మొండి బకాయిలు, చిట్‌ఫండ్ తదితర రాజీ పడే అన్ని కేసులను త్వరితగతిన పరిష్కరించనున్నట్టు చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బ్యాంకు, ఇన్సురెన్స్, చిట్‌ఫండ్‌ల అధికారులు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు : మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



నారాయణఖేడ్ పురపాలక సంఘ కార్యాలయంలో మట్టి వినాయక ప్రతిమలను అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి



శివ్వంపేట : దొంతి గ్రామంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

మట్టి వినాయక విగ్రహాలను పూజించండి

మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించాలని పలువురు పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



హవేళిఘణపూర్ : కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు మట్టి వినాయకులను ఇస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు



మునిపల్లి: యునైటెడ్ స్కూల్‌లో గణపతి ఆకారంలో విద్యార్థులు



తూప్రాన్ గీతా స్కూల్‌లో మట్టి వినాయకులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నారాయణఖేడ్‌లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి



కంది ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని ప్రభుత్వ పాఠశాలలో మట్టి గణపతుల విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులు



నర్సాపూర్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా

కమీషన్ ఇవ్వరా?

(5వ పేజీ తరువాయి)

చెల్లిస్తారు. అయితే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ప్రతి నెలా సుమారు 8,280 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ లెక్కన ఐదు నెలలకు రూ.5 కోట్లకు పైగా కమీషన్‌రావాల్సి ఉంది. సెప్టెంబరు నెలకు సంబంధించి 8,735 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం కోటా లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉన్నది. ప్రభుత్వం చెల్లించే కమీషన్ నుంచే రేషన్ దుకాణాల అద్దె, కరెంటు బిల్లులు, హమాలీ కూలీల ఖర్చు, తూకం వేసే సిబ్బంది వేతనాలు, ఇతరత్ర ఖర్చులను భరించాల్సి వస్తుందని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- బీజేపీ జిల్లా కమిటీతో ఎంపీ రఘునందన్‌రావు



ఎంపీ రఘునందన్‌రావుతో బీజేపీ మెదక్ జిల్లా నూతన కమిటీ

మెదక్ అర్బన్/చిలప్‌చెడ్/శివ్వంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతానికి నూతన ఉత్సాహంతో కృషి చేయాలని బీజేపీ జిల్లా నూతన కమిటీకి ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన కమిటీ ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా ఎన్నికైన కమిటీని ఎంపీ అభినందించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని రఘునందన్‌రావు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సురేష్, రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బుచ్చేష్‌యాదవ్ పాల్గొన్నారు. చిలప్‌చెడ్ మండలం పరిధిలోని జగ్గంపేట పాఠశాలకు రెండు అదనపు తరగతి గదులను మంజూరు చేయాలని ఎంపీ రఘునందన్‌రావును బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీజేపీ మెదక్ జిల్లా కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన శివంపేట మండలం ఉసిరికాపల్లి గ్రామానికి చెందిన అశోక్ సాధులను ఎంపీ రఘునందన్‌రావు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు సురేష్, రమేష్‌గౌడ్, బిక్షపతి పాల్గొన్నారు.

ఎన్నికలంటే కాంగ్రెస్‌కు భయమెందుకు? : ఎమ్మెల్యే

కౌడిపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలంటే కాంగ్రెస్‌కు ఎందుకంత భయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీని ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బిస పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా సంగప్ప, యూత్ అధ్యక్షుడిగా సందీప్, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్‌గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించాలని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సార రామగౌడ్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఫీవర్ ఇంటింటి సర్వే



సంగారెడ్డిలో డెంగ్యూ జ్వరంపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో సంగారెడ్డి పట్టణంలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ అధికారులు మంగళవారం డెంగ్యూ జ్వరాలపై సర్వే నిర్వహించారు. పట్టణంలోని 23వ వార్డు శివాజీనగర్‌లో ఇంటింటికి తిరిగి కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నారు. జ్వరాలతో బాధపడుతున్నారా అనే విషయాలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆర్‌పీ మంజుల మాట్లాడుతూ జ్వరాలతో బాధపడే వారికి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కొల్చారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం రంగంపేటలో మాధవానందస్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేసి, మాధవానందస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేష్‌గౌడ్, మధు, శ్రీశైలం, శేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

కరాటేలో బంగారు, సిల్వర్, కాంస్య పతకాలు



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ బోడుప్పల్‌లో రేంజుకి షోటోకాన్ కరాటే వారు నిర్వహించిన నేషనల్ లెవెల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో సంగారెడ్డికి చెందిన పలువురు పతకాలు సాధించారు. రాంచరన్, అబిరాం, ఆకాశ్‌లు బంగారు పతకాలు సాధించగా, రుత్విక్, ఆన్స్‌లు సిల్వర్, ఆదిత్య, శివ కాంస్య పతకాలు సాధించారు. 14 సంవత్సరాల విభాగంలో అల్ కలర్ బెల్ట్స్ విభాగంలో ఆకాశ్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ సాధించారు. వీరిని గ్రాండ్ మాస్టర్ బాలేశ్వర్, మాస్టర్లు నవీన్, శ్రీకాంత్, చరణ్‌లు విజేతలను అభినందించారు.

న్యూస్ బాక్స్

ఇస్నాపూర్ కమిషనర్‌గా వెంకటకిషన్‌రావు

పటాన్‌చెరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ పురపాలక సంఘానికి కమిషనర్‌గా వెంకటకిషన్‌రావు నియమితులయ్యారు. మంగళవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఫ్లైఓవర్ కోసం గ్రామస్థుల ఆందోళన

చేగుంట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నార్సింగి మండలం వల్లూరు గ్రామ శివారులోని జాతీయ రహదారి బ్రిడ్జి లేక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న నార్సింగి ఎస్‌ఐ సృజన సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

చెరువు అలుగు ధ్వంసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

కల్హేర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కల్హేర్ మండలం మార్డి గ్రామ శివారులోని అంబట్ కుంట చెరువు అలుగును ధ్వంసం చేసి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు తహసీల్దార్, నీటిపారుదల శాఖ ఏఈకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల కురిసి భారీ వర్షాలకు చెరువులోకి పూర్తిస్థాయిలో నీరు చేరడంతో కల్హేర్‌కు చెందిన బాబురావ్ అనే వ్యక్తికి చెందిన వరి పంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నీట మునిగిందని, పంటను కాపాడుకోవడానికి అలుగును ధ్వంసం చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రిటైర్డు ఉద్యోగులు సంఘం అధ్యక్షుడిగా పర్వయ్య

కల్హేర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కల్హేర్ మండల రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మాసాన్‌పల్లికి చెందిన డి.పర్వయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.లింగయ్య, జి.సుశీల, ప్రధాన కార్యదర్శిగా ఎం.విఠల్ గౌడ్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా ఎన్.జనార్ధన్, కోశాధికారిగా ఎన్.రాములు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.నానోధర్, కార్యనిర్వహక కార్యదర్శిగా వై.మణెమ్మ, పీఆర్వోగా బాచ శ్రీనివాస్‌ను ఎన్నుకన్నారు. ఎన్నికల అధికారిగా సంగారెడ్డి జిల్లా సంఘం బాధ్యులు ఎం.మనోహర్ ప్రసాద్ వ్యవహరించారు.

పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మొక్కలు పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలో మంగళవారం పలు కాలనీల్లో స్థానికులకు మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడుకుంటే ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ కారక్రమంలో సీడీసీ మాజీ ఛైర్మన్ విజయేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామప్ప, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు విఠల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గార్డెన్‌దొర సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే



అల్లీపూర్‌లోగల గార్డెన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాణిక్‌రావు

జహీరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి గార్డెన్‌దొర చేసిన సేవలు అమోఘమని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అల్లీపూర్‌లో గార్డెన్‌దొర వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్యదక్ష, దేవునిపట్ల అమితమైన ప్రేమ, తదితరాలను బట్టి 1947లో ఆయన హైదరాబాద్ నుంచి జహీరాబాద్ పాఠశాలకు బదిలీపై వచ్చారన్నారు. తన కుటుంబసభ్యులతో కలిసి విద్య, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికి కృషిచేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, బండి మోహన్, శివప్ప, రవికిరణ్, వరాలు, గార్డెన్ దొర అభిమానులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ నరోత్తం తదితరులు గార్డెన్‌దొర విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆసుపత్రిలో కిటకిట



నర్సాపూర్ ఆసుపత్రిలో మందుల కోసం బారులుతీరిన జనం

నర్సాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో వైరల్ ఫీవర్‌తో అనేకమంది బాధపడుతున్నారనడానికి నర్సాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి వస్తున్న జనాలే నిదర్శంగా చెప్పవచ్చు. 15 రోజులుగా నర్సాపూర్ ఆస్పత్రికి ఆయా గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చి చూయించుకుంటున్నారు. మంగళవారం కూడా ఆస్పత్రికి వచ్చిన రోగులు పరీక్షల అనంతరం మందుల కోసం బారులుతీరారు. ఎక్కువగా జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారు వస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాపన్నపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారుల అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం పాపన్నపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మితంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజర పట్టిక, ఓపీ, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు

వట్‌పల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసి విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని దేవనూర్ బాలుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, విద్యార్థుల గదులు, వంటశాల నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డెన్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : డీఈవో

పెద్దశంకరంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి మెరుగైన వైద్యమందించండి



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

రామాయంపేట/మెదక్ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్‌లో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డ అనిల్‌కు మెరుగైన వైద్యమందించాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు సూచించారు. మంగళవారం కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి తెలుసుకున్నారు. తొనిగండ్ల ప్రాంతానికి చెందిన అనిల్ ప్రైవేట్ కరెంట్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. ఝాన్సీలింగాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేసే క్రమంలో అనుకోకుండా విద్యుత్ లైన్ ఆన్‌కావడంతో ప్రమాదం జరిగింది. మంచి వైద్యమందించాలని వైద్యులకు సూచించారు. అలాగే మెదక్ మండలం మాచవరం గ్రామంలో సొగ కుమార్ అనే వ్యక్తి గుడిసె కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు అందించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మొల్సాబ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌చౌదరి, కాంగ్రెస్ మండల నాయకుడు శంకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేట గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీచేసినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో నేర్పుతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. అనంతరం నల్లవాగు ప్రాజెక్టు చివరి ఆయకట్టులోని కల్హేర్, ఇందిరానగర్, మార్డి గ్రామ శివారుల్లోని కుడి కాలువను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ మల్లేశం, ఎంపీడీవో సంగ్రామ్, నాయకులు మన్నె క్రిష్ణ, భూమేష్, యాదవరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

రూ.1.4 కోట్లతో రోడ్డు విస్తరణ

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని గోనెమ్మబస్తీలో రూ.1.4 కోట్లతో సీసీ రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలు తొలగించాలని చెప్పారు. జాతీయ రహదారితో గోనెమ్మబస్తీ అనుసంధానం అవుతుందని తెలిపారు. అలాగే పటాన్‌చెరు సాకి చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట ఏఈ శివకుమార్ తదితరులు ఉన్నారు.

మెదక్ ఆర్టీసీలో విజిలెన్స్ తనిఖీలు

- ఉద్యోగులకు స్వీట్ల పంపిణీలో అవకతవకలపై ఫిర్యాదు

మెదక్ అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ఆర్టీసీలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. రాఖీ పౌర్ణమి పండుగ నేపథ్యంలో ఆర్టీసీకి భారీ ఆదాయం సమకూరింది. దాంతో టీజీ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆయా డిపోల పరిధిలోని ఉద్యోగులందరికీ స్వీట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఒక్కొక్క స్వీట్ బాక్స్ రూ.25 చొప్పున డ్రా చేసుకోవాలని సూచించారు. మెదక్ ఆర్టీసీ డిపో పరిధిలో దాదాపు 400లపైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. అయితే ఆర్టీసీ అధికారులు మాత్రం కొంత మంది ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేసి.. చేతులు దులుపుకున్నారు. మిగితా ఉద్యోగులు అధికారులను అడుగగా.. పంపిణీ పూర్తైందని సమాధానం ఇచ్చారు. దాంతో అధికారులపై ఉద్యోగులు ఫిర్యాదు చేయగా.. విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఉద్యోగులకు స్వీట్ల పంపిణీ, డబ్బులు డ్రా వివరాలను సేకరించారు. అధికారుల తీరుపై ఆరా తీశారు. ఈ విషయమై డీఎం సురేఖ మాట్లాడుతూ.. డిపోలోని 80 శాతం మంది ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశామని, ఎలాంటి అవకతవకలు జరగలేదని, ఒక వేళ అలా జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి : మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసుల దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసుల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన నేరాల పరిస్థితి, పెండింగ్ కేసుల పరిణామాలు, విచారణలో ఉన్న కేసుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పాఠశాల, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్‌ఐలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారి, సైబర్ క్రైం వల్ల ఎందరి జీవితాలు నాశనం అవుతున్నాయని వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ వాటికి దూరంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ కాలేజీలో డ్రగ్స్, సైబర్ క్రైంపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగంతో పాటు కాలేజీ యాజమాన్యం పాల్గొన్నారు.